క్వారీ నీటిగుంతలో పడి..

ఇద్దరు విద్యార్థులు మృతి

షేక్‌అయాన్

షేక్‌నవాజ్

జగద్గిరిగుట్ట, ఏప్రిల్ 18: సరదాగా స్నానానికి వెళ్లిన ఇద్దరు విద్యార్థులు క్వారీ నీటిలో మునిగి చనిపోయారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. ఎల్లమ్మబండకు చెందిన షేక్ అయాన్(15), షేక్ నవాజ్(15) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నారు. వీరి మిత్రుడు హైదర్‌తో కలిసి గురువారం మధ్యాహ్నం గాజులరామారం పరిధిలోని దేవేందర్‌నగర్ సమీపంలో ఉన్న క్వారీ నీటి గుంతల వద్దకు వెళ్లారు. నీటిలోకి దిగిన ఆయాన్, నవాజ్‌కు ఈత రాకపోవడంతో మునిగారు. ఇద్దరూ బయటకు రాకపోవడంతో గట్టు సమీపంలో ఉన్న హైదర్ భయపడి.. విషయాన్ని స్థానికులకు తెలిపాడు. దీంతో పోలీసులు, స్థానికులు కలిసి నీట మునిగిన ఇద్దరినీ బయటకు తీశారు. ప్రగతీనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే వారిద్దరూ చనిపోయినట్టు వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసిన జగద్గిరిగుట్ట ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్.. వివరాలు సేకరించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

నేరనియంత్రణకు చర్యలు తీసుకోవాలి

రాచకొండ సీపీ తరుణ్ జోషి

కీసర, ఏప్రిల్ 18: పోలీసుస్టేషన్ పరిధిలో జరిగే నేరాలను అదుపు చేయాలని, నేరనియంత్రణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని రాచకొండ పోలీసు కమిషనర్ తరుణ్ జోషి తెలిపారు. కీసర పోలీసుస్టేషన్‌లో గురువారం ఆయన స్టేషన్ అధికారులతో క్రైమ్‌పై రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో కీసర పోలీసుస్టేషన్ పరిధిలో నమోదైన పోక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, పెండింగ్ కేసుల విచారణ, ఇతర కేసుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భగా సీపీ మాట్లాడుతూ.. పోలీసుస్టేషన్‌కు వచ్చే ప్రజలతో పోలీసులంతా స్నేహపూర్వకంగా వ్యవహరించాలని కోరారు. ఫిర్యాదు దారుల బాధలను ఓపికగా విని, వారికి తగిన న్యాయం చేయాలని తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో సిబ్బంది పనితీరునున అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో డీసీపీ పద్మజ, ఏసీపీ నరేందర్‌గౌడ్, కీసర ఇన్‌స్పెక్టర్ వెంకటయ్యతో పాటు ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం ఖరీదు..₹20 వేలు

కారును బండితో ఢీకొట్టిన బాలుడు

మరమ్మతులకు డబ్బులు అడిగిన డ్రైవర్

లేదంటే కేసు పెడతానంటూ బెదిరింపులు

చేతిలో చిల్లిగవ్వలేక.. మానసిక సంఘర్షణతో బాలుడి తల్లి బలవన్మరణం

ఫిలింనగర్‌లో విషాదం

బంజారాహిల్స్, ఏప్రిల్ 18: చెప్పినా వినకుండా ద్విచక్రవాహనాన్ని తీసుకెళ్లిన కొడుకు.. దారిలో కారును ఢీకొట్టడంతో అది కొంత దెబ్బతిన్నది. కారు మరమ్మతులకు డ్రైవర్ రూ. 20 వేలు కావాలని బెదిరించాడు... మైనర్ అయిన కుమారుడిపై కేసు నమోదు కావొద్దంటే డబ్బులు ఇవ్వాల్సిన పరిస్థితి. అయితే చేతిలో చిల్లిగవ్వలేక.. తీవ్ర మానసిక సంఘర్షణకు గురైన ఆ బాలుడి తల్లి .చివరకు బలవన్మరణానికి పాల్పడింది. ఈ విషాద ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రాజమండ్రికి చెందిన వెంకటరమణ ఫిలింనగర్‌లోని దీన్ దయాళ్‌నగర్ బస్తీతో నివాసముంటూ కూలీ పనులు చేస్తుంటాడు. అతడి భార్య సూర్యకుమారి(35) ఓ ఆస్పత్రిలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నది. వీరికి కొడుకు(14), కుమార్తె ఉన్నారు. బుధవారం ఉదయం సూర్యకుమారి డ్యూటీకి వెళ్లిపోగా, కొడుకు తల్లికి చెందిన ద్విచక్రవాహనాన్ని తీసుకుని శ్రీరామనవమి సందర్భంగా గుడికి వెళ్లొస్తానంటూ బయటకు వెళ్లాడు. ఈ క్రమంలో హకీంబాబా దర్గా సమీపంలో ఓ కారును ఢీకొట్టాడు. దీంతో కారు కొంత దెబ్బతిన్నది. ఆగ్రహంతో కారు డ్రైవర్ చంద్రశేఖర్ బండి తాళం చెవిని తీసుకున్నాడు. మరో స్నేహితుడు మహేశ్‌ను అక్కడకు పిలిపించాడు. వారిద్దరూ కలిసి ఆ బాలుడితో పాటు బండిని సమీపంలోని యజమాని ఇంటివద్దకు తీసుకెళ్లారు. కారుకు రిపేరు చేయాలంటే రూ.20వేలు అవుతుందంటూ..బాలుడి తండ్రికి చంద్రశేఖర్ ఫోన్ చేసి చెప్పాడు. సాయంత్రం 4గంటల్లోగా డబ్బులు ఇచ్చి బండి తీసుకువెళ్లాలని, లేకుంటే పోలీసులకు ఫిర్యాదు చేస్తే పెద్ద కేసు అవుతుందని బెదిరించి ఆ బాలుడిని పంపించారు. ఇదే విషయాన్ని వెంకటరమణ తన భార్య సూర్యకుమారికి ఫోన్ చేసి చెప్పడంతో ఆమె తీవ్ర ఆందోళనతో ఇంటికి వచ్చింది. చేతిలో చిల్లిగవ్వలేదని, వద్దంటే బండి తీసుకువెళ్లి పీకలమీదికి తెచ్చారంటూ ఆవేదన చెందిన సూర్యకుమారి..రూ. 20వేలు ఇవ్వకపోతే తన కొడుకు మీద కేసు అవుతుందని కన్నీళ్లపర్యంతమైంది. మధ్యాహ్నం మరోసారి భర్తకు ఫోన్ చేసిన సూర్యకుమారి డబ్బులు తెచ్చే పరిస్థితి లేదని, చావే శరణ్యమంటూ..ఫోన్ కట్ చేసి.. చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. భర్త వెంకటరమణ ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కారు డ్రైవర్ చంద్రశేఖర్, మహేశ్‌లపై ఐపీసీ 306 సెక్షన్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



హెచ్‌సీయూలో విద్యార్థుల ఘర్షణ

కేసులు నమోదు చేసిన గచ్చిబౌలి పోలీసులు

కొండాపూర్, ఏప్రిల్ 18 : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) లో రెండు విద్యార్థి సంఘాల మధ్య చోటు చేసుకున్న వివాదం ఘర్షణకు దారి తీసింది. రెండు విద్యార్థి సంఘాలు పరస్పరం దాడులు చేసుకోవడంతో వర్సిటీని ఉద్రిక్తంగా మార్చింది. అర్ధరాత్రి విద్యార్థి సంఘాల మధ్య చోటు చేసుకున్న ఈ వివాదంతో వర్సిటీలో భయాందోళనలు నెలకొన్నాయి. పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని రెండు వర్గాలను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. గచ్చిబౌలి పోలీసుల కథనం ప్రకారం.. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని జే హాస్టల్ సమీపంలో బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత వర్సిటీకి చెందిన రెండు విద్యార్థి సంఘాలకు చెందిన విద్యార్థులు ఒకరిపై మరొకరు దాడులకు పాల్పడ్డారు. నినాదాల కారణంగా ఏర్పడిన వివాదం.. చిలికి చిలికి గాలి వానగా మారి ఘర్షణకు దారి తీసింది. తమపై అకారణంగా దాడి చేశారని ఓ సంఘానికి చెందిన బాలకృష్ణ, మరో విద్యార్థి సంఘానికి చెందిన హఫీజ్ ఫిర్యాదు చేశారు. ఇరువర్గాల నుంచి ఫిర్యాదులు తీసుకున్న పోలీసులు.. రెండు వర్గాల వారిపై కేసులు నమోదు చేసి, వర్సిటీలో భద్రతను పెంచారు. రెండు సంఘాల విద్యార్థులు తమపై దాడి జరిగిందంటూ.. సోషల్ మీడియా వేదికగా ప్రచారం చేసుకుని ఆందోళనకు పిలుపునివ్వడంతో వర్సిటీ ఉద్రిక్తంగా మారింది. అర్ధరాత్రి చోటు చేసుకున్న ఈ వివాదంతో వర్సిటీలోని మిగితా విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. దీంతో పోలీసులు పికెటింగ్ ఏర్పాటు చేసి భద్రతను పెంచారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా విద్యార్థులను చెదరగొట్టారు. వర్సిటీలో ఎలాంటి ఆందోళనలు చేపట్టరాదని, బయటి వ్యక్తులను లోనికి అనుమతి ఇవ్వడంలేదు. మాదాపూర్ డీసీపీ వినీత్ ఆధ్వర్యంలో పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు.

గూగుల్ రివ్యూస్ రాయాలంటూ..

నమ్మించి రూ.16.70 లక్షలు స్వాహా

ప్రభుత్వ ఉద్యోగికి సైబర్ ఛీటర్స్ టోకరా

సిటీబ్యూరో, ఏప్రిల్ 18 (నమస్తే తెలంగాణ): గూగుల్‌లో రివ్యూస్ రాసి, రోజువారి టాస్కులు పూర్తి చేస్తే మంచి లాభాలొస్తాయంటూ నమ్మిస్తూ ఒక ప్రభుత్వ ఉద్యోగికి సైబర్‌నేరగాళ్లు రూ. 16.70 లక్షలు బురిడీ కొట్టించారు. పోలీసుల కథనం ప్రకారం.. వాట్సాప్‌లో ఈజీగా డబ్బు సంపాదించేందుకు ఇన్‌స్టాగ్రామ్ వీడియోలు లింక్ చేయాలని, దానికి కమీషన్ ఇస్తామంటూ బాధితుడిని నమ్మించారు. వారి మాటలు నమ్మిన బాధితుడు.. నేరగాళ్లు చెప్పినట్లు చేశాడు. చేసిన లాభాలొచ్చాయంటూ బుట్టలో వేశారు. తొలుత రూ.20 వేల పెట్టుబడితో మొదలు పెట్టి.. లాభాలు కూడా ఇచ్చారు. ఆ తరువాత స్క్రీన్‌పైనే లాభాలు కనిపించాయి. విత్ డ్రా చేసుకునే అవకాశం లేకుండా చేశారు. ఆ డబ్బు డ్రా చేసుకోవాలంటే ఇంకో స్టెప్ ముందుకు వెళ్లాలని సూచించిన నేరగాళ్లు.. బాధితుడి వద్ద నుంచి లక్షల్లో పెట్టుబడి పెట్టించారు. ఆ తరువాత కూడా రూ.20 లక్షలు పెట్టుబడి పెడితే.. ఇప్పటి వరకు సంపాదించిందంతా తీసుకునేందుకు వీలుంటుందని బాధితుడిని ఫోర్స్ చేశారు. బాధితుడు ఇదంతా మోసమని గుర్తించాడు. అప్పటికే నేరగాళ్లు సూచించిన ఖాతాల్లో రూ. 16.70 లక్షల వరకు బదిలీ చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు సీసీఎస్ సైబర్‌క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

కొనసాగుతున్న తనిఖీలు

సిటీబ్యూరో, ఏప్రిల్ 18 (నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు గ్రేటర్ వ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నాయి. ఇందులో భాగంగా.. ఎన్నికల కోడ్ వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు రూ. 14.34 కోట్ల నగదును ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ సీజ్ చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ తెలిపారు. రూ.రెండుకోట్ల ఒక లక్ష విలువజేసే ఇతర వస్తువులు, 20,767.52 లీటర్ల అక్రమ మద్యాన్ని పట్టుకున్నట్లు పేర్కొన్నారు. 195 మందిపై కేసులు నమోదు చేసి, 192 మందిని అరెస్టు చేసినట్లు కమిషనర్ తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన నగదు, ఇతర వస్తువులపై 396 ఫిర్యాదులు రాగా.. వాటిని పరిష్కరించారని, 261 మందిపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. 2,877 లైసెన్స్ ఆయుధాలను డిపాజిట్ చేశారని రోనాల్డ్‌రాస్ తెలిపారు. తాజాగా, గడిచిన 24 గంటల వ్యవధిలో రూ 2.96 లక్షల నగదు, రూ.1.69 లక్షల విలువైన వస్తువులను పట్టుకొని, సీజ్ చేసినట్లు చెప్పారు.

ఫోన్ ట్యాపింగ్ కేసులో బెయిల్ పిటిషన్ దాఖలు

నాంపల్లి కోర్టులు, ఏప్రిల్ 18 (నమస్తే తెలంగాణ): ఫోన్ ట్యాపింగ్ కేసులో స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో మాజీ అధికారి ప్రణీత్‌రావుతో పాటు భుజంగరావు, తిరుపతన్న, రాధాకిషన్‌రావుల తరపున జిల్లా కోర్టులో వారి న్యాయవాదులు బెయిల్ పిటిషన్లు దాఖలు చేశారు. దాఖలైన పిటిషన్లు నాంపల్లిలోని మొదటి అదనపు జిల్లా సెషన్ కోర్టుకు బదిలీ చేశారు. ఈ కోర్టులో గురువారం పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు నోటీసులు జారీ చేశారు.

విజయయాత్రకు షరతులతో అనుమతి

హైదరాబాద్, ఏప్రిల్ 18 (నమస్తే తెలంగాణ): హనుమాన్ విజయ యాత్ర పేరిట 23న నిర్వహించే ర్యాలీ సందర్భంగా శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా షరతులతో అనుమతి ఇవ్వాలని నగర పోలీసులకు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ర్యాలీలో వంద బైక్‌లకు అనుమతి ఇవ్వాలని, ఉదయం 10 గంటలకు మొదలు పెట్టి.. మధ్యాహ్నం 12 గంటలకు ర్యాలీ ముగించాలని, రెచ్చగొట్టే ప్రసంగాలు చేయరాదని, డీజే సౌండ్స్ వినియోగించరాదని చెప్పింది. హైదరాబాద్ నగరంలో హనుమాన్ విజయ యాత్ర ర్యాలీకి పోలీసులు అమతించేలా ఆదేశాలు ఇవ్వాలంటూ తెలంగాణ రాష్ట్ర భజరంగ్ సేన అధ్యక్షుడు ఎన్ఆర్ లక్ష్మణరావు వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ బి. విజయ్‌సేన్‌రెడ్డి గురువారం విచారణ చేపట్టారు. ఈ నెల 23న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు హనుమాన్ వ్యాయామశాల నుంచి తాడ్ బండ్ హనుమాన్ ఆలయం వరకు ర్యాలీ నిర్వహించేందుకు అనుమతి ఇచ్చేలా పోలీసులకు ఉత్తర్వులు ఇవ్వాలని పిటిషనర్ న్యాయవాది కోరారు. వాదనల తర్వాత హైకోర్టు పై విధంగా షరతులతో అనుమతి ఇవ్వాలని పోలీసులను ఆదేశించి, పిటిషన్‌పై విచారణను మూసేసింది.

ముగ్గురు డ్రగ్ స్మగ్లర్స్ అరెస్టు

ఏడు గ్రాముల హెరాయిన్ స్వాధీనం

సిటీబ్యూరో, ఏప్రిల్ 18 (నమస్తే తెలంగాణ): బెంగళూర్‌లో డ్రగ్స్ కొనుగోలుచేసి.. హైదరాబాద్‌లో విక్రయిస్తున్న ముగ్గురు డ్రగ్ స్మగ్లర్లను ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ రష్మిపెరుమాళ్ కథనం ప్రకారం.. మెహిదీపట్నంకు చెందిన మాన్‌సింగ్ బాట్లా అలియాస్ తేజ డిగ్రీ వరకు చదివి, చెఫ్‌గా పనిచేశాడు. తరచూ అతడు తన కాలేజీ, స్కూల్ ఫ్రెండ్స్‌ను కలిసిన సమయంలో కొందరు సీనియర్స్ గంజాయి తీసుకుంటూ కనిపించేవారు. అప్పటికే రెండు కేసుల్లో జైలుకు వెళ్లి వచ్చిన మాన్‌సింగ్, ఆ తరువాత హెల్త్ కేర్ కన్సల్టెంట్‌గా చేరాడు. ఆ తర్వాత డ్రగ్స్ విక్రయించాలని ప్లాన్ చేశాడు. ఇందుకు టోలిచౌకి ప్రాంతానికి చెందిన సయ్యద్ ఓబైద్, షబ్బీర్ హుస్సేన్‌ను కలిసి, తన ప్లాన్‌ను వివరించాడు. దీంతో వారిద్దరూ హైదరాబాద్‌లో డ్రగ్స్ విక్రయించేందుకు అంగీకరించారు. ఇందులో భగంగానే బెంగళూర్ లోని యశ్వంత్‌పూర్‌లో ఉన్న ఒక నైజీరియన్ వద్దకు వెళ్లి.. అక్కడి నుంచి 7 గ్రాముల హెరాయిన్‌తో మాన్‌సింగ్ హైదరాబాద్‌కు వచ్చాడు. బెంగళూర్ నుంచి రాగానే సయ్యద్ ఒబైద్, షబ్బార్ హుస్సేన్‌ను రేతిబౌలిలో కలిశాడు. విశ్వసనీయ సమాచారం మేరకు.. ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్, గుడిమల్కాపూర్ పోలీసులు కలిసి ఈ ముగ్గురిని పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి 7 గ్రాముల హెరాయిన్, ఫోన్లు, బైక్ స్వాధీనం చేసుకున్నారు.

జోరుగా అక్రమ మద్యం విక్రయాలు

సైబరాబాద్‌లో రూ.4.03 లక్షల మద్యం పట్టివేత

సిటీబ్యూరో, ఏప్రిల్ 18 (నమస్తే తెలంగాణ): డ్రై డే (నిషేధిత రోజు) రోజున అక్రమంగా మద్యం అమ్మకాలు జరిపిన 12 బెల్టు షాపులపై సైబరాబాద్ ఎస్ఓటీ అధికారులు దాడులు జరిపారు. ఈ దాడుల్లో 12 మందిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.4.03లక్షల విలువజేసే 365 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. శ్రీరామ నవమిని పురస్కరించుకుని ఈ నెల 17న మూడు కమిషనరేట్ల పరిధిలో మద్యం అమ్మకాలు చేపట్టవద్దంటూ ఆంక్షలు విధించారు. దీనిని ఆసరాగా చేసుకొని.. దుండిగల్, అల్వాల్, సురారం, మేడ్చల్, బాచుపల్లి, ఆర్‌సీ పురం, చందానగర్, గచ్చిబౌలి, మియాపూర్, అత్తాపూర్, మైలార్‌దేవ్‌పల్లి, నార్సింగి పోలీసు స్టేషన్ల పరిధిలో మద్యం మాఫియాలు అక్రమంగా బెల్టు షాపుల ద్వారా పెద్ద ఎత్తున మద్యం విక్రయాలకు పాల్పడ్డారు. ఈ మేరకు సమాచారం అందుకున్న సైబరాబాద్ ఎస్ఓటీ పోలీసు బృందాలు రంగంలోకి దిగి, ఆయా ఠాణాల పరిధిలో పెద్ద ఎత్తున దాడులు జరిపారు. ఈ దాడుల్లో 12 పోలీసు స్టేషన్ల పరిధిలో 12 అక్రమ మద్యం కేంద్రాలను నిర్వహిస్తున్న 12 మందిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.4,03,806ల విలువజేసే 365 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం కేసులను సంబంధిత ఠాణాలకు అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో..

జగద్గిరిగుట్ట, ఏప్రిల్ 18 : ద్విచక్ర వాహనాన్ని బస్ ఢీకొన్న ఘటనలో యువకుడు మరణించాడు. జగద్గిరిగుట్ట పోలీసుల కథనం ప్రకారం.. గాజులరామారం డివిజన్ మహదేవపురం నివాసి లక్ష్మణ్(19) బీటెక్ చదువుతున్నాడు. సమీపంలోని హోటల్‌లో టిఫిన్ తీసుకురావడానికి గురువారం ఉదయం స్కూటీపై ఇంటి నుంచి బయలుదేరాడు. మల్లారెడ్డినగర్ సమీపంలో ఎదురుగా వచ్చిన ప్రైవేటు బస్.. స్కూటీని ఢీకొంది. దీంతో కిందపడిపోయిన లక్ష్మణ్ తల పైనుంచి బస్సు వెళ్లడంతో అక్కడికక్కడే మరణించాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

దుకాణంలో చేతివాటం

షాప్ లిఫ్టింగ్ కేసు నమోదు

అమెరికాలో ఇద్దరు తెలుగు అమ్మాయిలు అరెస్టు

సిటీబ్యూరో, ఏప్రిల్ 18 (నమస్తే తెలంగాణ): అమెరికాకు ఉన్నత చదువుల కోసం వెళ్లి, కిరాణా కొట్టులో చేతి వాటం చూపించిన ఇద్దరు తెలుగు అమ్మాయిలపై అక్కడి పోలీసులు షాప్ లిఫ్టింగ్ నేరం కింద కేసు నమోదు చేసి, అరెస్టు చేశారు. మార్చి 19న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి.. హైదరాబాద్, గుంటూర్‌కు చెందిన ఇద్దరు యువతులు న్యూ జెర్సీలోని ఒక ప్రైవేట్ యూనివర్సిటీలో ఎం.ఎస్. చదువుతున్నారు. మార్చి 19న హోబోకెన్ నగరంలోని ఒక దుకాణానికి వెళ్లి షాపింగ్ చేశారు. చివరకు బిల్లు చెల్లించే సమయంలో కొన్ని వస్తువులకు బిల్లు చెల్లించి, మరికొన్నింటికి చెల్లించకుండా నొక్కేశారు. ఈ విషయాన్ని షాప్ యజమాని గుర్తించి హోబోకెన్ పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు దుకాణంలోని సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించి, ఇద్దరు యువతులు దొంగతనం చేసినట్లు నిర్ధారించారు. దీంతో పోలీసులు ఆ ఇద్దరు యువతులను అదుపులోకి తీసుకోగా, తమకు తెలియకుండా చేశామని, రెట్టింపు డబ్బు ఇస్తామని, పొరపాటయ్యిందంటూ పోలీసులను వేడుకున్నారు. అయితే, పోలీసులు ఈ విషయాన్ని చట్టపరంగా ఎదుర్కోవాలంటూ ఆ ఇద్దరు యువతులను అరెస్టు చేశారు. దుకాణంలో జరిగిన ఘటనను షాప్‌లిఫ్టింగ్‌గా అక్కడి పోలీసులు పేర్కొంటారు. ఉన్నత చదువులకు వెళ్లి పరువు తీసుకున్నారంటూ ఆ యువతులు చేసిన దొంగపనిపై పలువురు పెదవి విరుస్తున్నారు.

అప్పు విషయంలో గొడవ

కత్తితో దాడిచేసిన కానిస్టేబుల్ కుటుంబం

మాదన్నపేట, ఏప్రిల్ 19 అప్పు చెల్లించే విషయంలో తలెత్తిన వివాదం కత్తిపోట్లకు దారితీసింది. ఈ ఘటన ఐఎస్ సదన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. బడంగ్‌పేట ప్రాంతానికి చెందిన సాయికుమార్ కార్ల వ్యాపారి. 2022లో తన సోదరి వివాహం కోసం పెద్ద నాన్న వెంకటేశ్ కుమారుడైన మహేశ్‌కుమార్ వద్ద రూ. రెండు లక్షలు అప్పుగా తీసుకున్నాడు. మహేశ్‌కుమార్ సంతోష్‌నగర్ పీఎస్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. కాగా.. సాయికుమార్ తాను తీసుకున్న అప్పును వాయిదాల పద్ధతిలో చెల్లిస్తున్నాడు. మొత్తం డబ్బులు ఒకేసారి చెల్లించాలంటూ ఇటీవల మహేశ్‌కుమార్ ఒత్తిడి చేస్తున్నాడు. ఈ విషయంలో ఇద్దరి మధ్య గొడవ జరుగుతోంది. అయితే, గురువారం ఉదయం సాయికుమార్‌ను ఇంటికి రప్పించుకున్న మహేశ్‌కుమార్, అతడి కుటుంబ సభ్యులు గొడవపడి, కత్తితో దాడిచేశారు. ఈ ఘటనను గమనించిన స్థానికులు.. గాయపడిన సాయికుమార్‌ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

తలకొండపల్లి తాసీల్దార్‌కు నోటీసులు

ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన వైనం

సిటీబ్యూరో, ఏప్రిల్ 18 (నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా చంద్రధన గ్రామంలో భూ యజమాని శ్రీనివాసరాజు కిడ్నాప్ కేసు వ్యవహారంలో తలకొండపల్లి తాసీల్దార్ వెంకటరంగారెడ్డికి సెక్షన్ 41 ఏ సీఆర్‌పీసీ కింద పోలీసులు నోటీసులు జారీ చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ నోటీసుపై మోకిలా ఇన్‌స్పెక్టర్ వీరబాబును వివరణ కోరగా.. తాసీల్దార్‌కు నోటీసులు జారీ చేసిన విషయం వాస్తవమేనన్నారు. పదిహేను రోజుల కిందటే నోటీసులు ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఇచ్చిన నోటీసులకు తాసీల్దార్ వివరణ కూడా ఇచ్చారని స్పష్టం చేశారు. ఈ కేసు దర్యాప్తులో ఉన్నదని, కలెక్టర్ అనుమతితో తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు.

'హిల్స్'లో గ్లాస్ బ్రేకింగ్ ముఠా!

వరుస ఘటనలతో బెంబేలెత్తుతున్న షాపుల నిర్వాహకులు

నెల రోజులుగా ఘటనలు

బంజారాహిల్స్, ఏప్రిల్ 18: బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని ప్రధాన రహదారులపై ఉన్న షాపుల అద్దాలపై దాడులు జరుగుతూనే ఉన్నాయి. తాజాగా మరికొన్ని దాడులు వెలుగులోకి వచ్చాయి. ఇటీవల సుమారు 6 స్టోర్లకు సంబంధించిన అద్దాలను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసినట్లు ఫిర్యాదులు వచ్చాయి. పోలీసులు కేసులు నమోదు చేసి, దర్యాప్తు కూడా చేపట్టారు. తాజాగా.. బంజారాహిల్స్ పరిధిలో ఈ తరహాలోనే జరిగిన మరో రెండు ఘటనలపై పోలీసులకు ఫిర్యాదులు అందాయి. పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్ నం. 2లో ఉన్న ఇమ్రాన్ ఫ్లాజా బిల్డింగ్‌లోని ఫస్ట్ ఫ్లోర్‌లో జాక్ పేరుతో రెస్టారెంట్ నడుస్తున్నది. ఈ నెల 2న సాయంత్రం 7గంటల సమయంలో రెస్టారెంట్‌కు సంబంధించిన అద్దాలు ఒక్కసారిగా ధ్వంసమయ్యాయి. దీంతో రెస్టారెంట్‌లోని సిబ్బందితో పాటు కస్టమర్లు ఒక్కసారిగా ఉలిక్కి పడ్డారు. అద్దాల్లో ఏవైనా సమస్యలు రావడంతో పగిలిపోయి ఉండవచ్చని భావించారు. అయితే, తాజాగా.. ఇతర ప్రాంతాల్లో కూడా ఇదే రకమైన ఘటనలు వెలుగులోకి వచ్చాయి. దీంతో ఎవరో ఉద్దేశపూర్వకంగానే అద్దాలు పగలగొడుతున్నట్టు పోలీసులు గుర్తించారు. ఇదిలాఉండగా.. జౌక్ రెస్టారెంట్ నిర్వాహకులు మీర్ మొహియుద్దీన్ అలీఖాన్ గురువారం బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఐపీసీ 308 సెక్షన్ కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మరో ఘటనలో బంజారాహిల్స్ రోడ్ నం. 2లోని జ్యోతి వెలెన్సియా బిల్డింగ్‌లోని గ్యాప్ స్టోర్‌కు చెందిన అద్దాలు పగిలిపోయినట్లు గురువారం స్టోర్ మేనేజర్ భిక్షపతి బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గత నెలరోజులుగా జరుగుతున్న వరుస ఘటనలపై పోలీసులు అలెర్ట్ అయ్యారు. దర్యాప్తులో భాగంగా అద్దాలు ధ్వంసమైన షాపులతో పాటు పరిసరాల్లో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీని పోలీసులు పరిశీలిస్తున్నారు.

పక్కా ప్లాన్‌తోనే కొంతమంది యువకులు ముఠాగా ఏర్పడి.. రోడ్లపై కనబడే స్టోర్లకు సంబంధించిన అద్దాలు పగలగొట్టినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అద్దాలు పగలగొట్టడానికి రాళ్లు విసరడంలేదని, ఒక్కసారిగా అద్దాలు పగలడాన్ని చూస్తుంటే.. రాళ్లకు బదులుగా ఎయిర్ గన్ లాంటి ఆయుధంతో దాడులకు తెగపడుతున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. నెల రోజుల నుంచి బంజారాహిల్స్ పరిధిలో ఇలాంటి దాడులు జరుగుతున్నట్టు పోలీసులకు ఫిర్యాదులొస్తున్నాయి.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

GOLD FINANCE

★మీ బంగారం బ్యాంకుల్లోగానీ, మార్వాడీ షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా, మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. Ph: 9100329739. NT-328121

PACKERS & MOVERS

★Sri Sai Packers & Movers Local and all over India, Resonable Price. Head Office Nacharam: 27176927, Ameerpet: 9866379391, DSNR: 9666993927, KKP: 9949513929, MP: 9848263927, ECIL: 9666983927. NT-328107

PEST CONTROL

★చెదలు, బొద్దింకలు నివారణ: న్యూ కన్‌స్ట్రక్షన్ ట్రీట్‌మెంట్ 10 సంవత్సరాల గ్యారెంటీ మరియు శానిటైజర్ స్ప్రే కొరకు సంప్ర: 9392468282, 8333030227. NT-327882

OLD AGE HOME

★వృద్ధులు & భార్యాభర్తలు A/C & N/C అటాచ్డ్ బాత్‌రూమ్, మేడిపల్లి/ ఉప్పల్, వృద్ధులు, బెడ్ పేషెంట్లు, ECIL, చీర్యాల్ 'X' రోడ్, భోజన వసతి మరియు 24/7 మెడికల్ సర్వీస్. ఫోన్: 7981467036, 9391039990, 9515474083. NT-311886

TOURS & TRAVELS